# నరకానికి పొలిమేరలు

సుందరం గదిలోకి వెళ్ళి ఉత్తరం ఇంకోసారి చదువుకున్నాడు.

* * *

సుందర్రావుకు వదిన దీవించి వ్రాయునది—

చిన్నతనంనుంచీ మీ అమ్మ భారాన్ని నేనే వహించి నిన్ను పెంచినందుకు ఈ ఉత్తరం రాయడంలో అసమంజసం ఏమీ లేదనుకుంటాను. మీ అమ్మే బ్రతికివున్నా ఇంతకంటె ఎక్కువ విచారించేది కాదేమో!

సృష్టిలో స్త్రీజన్మ ఒక నికృష్టపు బ్రతుకై పోయింది బాబూ! స్త్రీ దేహధర్మాలుగాని, మానసిక దౌర్బల్యాలుగాని సృష్టిలో ఆ విధంగానే ప్రకృతి ఏర్పరచింది. అవి తలుచుకున్నప్పుడల్లా మామీదమాకు చెప్పలేనంత అసహ్యాంకలుగుతుంది. 'తప్పెవరిది?' అని ప్రశ్న వేసుకుంటే సమాధానం రాదు. సమాధానం చెప్పలేని సంఘం సహితం తన అసమర్థతను విస్మరించి స్త్రీనే దూషిస్తుంది.

ఏదో చెయ్యాలని వుంటుంది. కాని చివరికి ఏమీ చెయ్యలేం. పరిస్థితులకులొంగిపోయే స్వభావము మాది.

సరస్వతి నీ గురించీ, నీ దగ్గరనుంచి ఉత్తరాలు వచ్చిన విషయం గురించీ ప్రతిరోజూ కనుక్కొంటూ వుండేది. నాకు అనుమానం వేసింది ఆమె నీ విషయంలో చూపుతున్న ప్రత్యేకశ్రద్ధకు. ఓరోజు నొక్కించి అడిగాను. సరస్వతి చెప్పింది విన్న తరువాత నేను నీకు ఈ వుత్తరం రాయకుండా వుండలేకపోయాను. ఆమె సామాన్యస్త్రీ; ప్రకృతి ప్రసాదించిన స్త్రీ సహజ లక్షణాలు, అవలక్షణాలతోనే అందరికి మల్లేనే పెరిగింది. పాపం ఆమెమాత్రం అంతకంటె ఏంచేస్తుంది?

"అక్కయ్యా! ఈ విషయం నాన్నకు తెలిస్తే ఇంకేమన్నా వుందా? గుండె బాదుకొని చచ్చిపోతాడు." అంది కంటినీరు పెట్టుకొని.

"త్వరలోనే వస్తాడమ్మా సుందరం" అని చెప్పాను. కాని నువ్వీమధ్య రావటానికి వీల్లేదనీ, డబ్బు పంపమనీ రాసిన ఉత్తరం చూసినతర్వాత ఇది రాయటం తప్పనిసరయింది.

నాకు తెలుసుబాబూ దీంట్లో మీ యిద్దరి తప్పూ లేదని. కాని ప్రకృతివేరు. సంఘంవేరు. ప్రకృతి తప్పుల్ని సంఘం క్షమించదు. సరస్వతికి ఇప్పుడు రెండో నెల వెళ్ళిపోయింది. జరిగిపోయిందాన్ని గురించి "పొరపాటు జరిగిపోయిందే"నని ఆలోచించడం సోమరిపోతులు, అసమర్థులు, వీరికి వాళ్ళు చేయవలసిన పని. ఇక జరగవలసిన దాన్ని గురించి ఆలోచించు.

స్త్రీ, ఆమెకు సమాజంలోవున్న స్థానం నీకు తెలియందికాదు. నువ్వు ఏ ధైర్యంతో సరస్వతిని పలకరిద్దామనుకున్నావో మనస్సులో, ఇకముందు కూడా ఆ ధైర్యంతోనే వుంటావని నానమ్మకం. నువ్వు ఏమాత్రం ఆలస్యం చేసినా పరిస్థితులు విషమించటం తథ్యం.

నేనూ ఓ ఆడదాన్నిగనక తోటి స్త్రీనిజూచి, సానుభూతి చూపించకుండా వుండలేకపోయాను. "నే ప్రయత్నం చేస్తానేమ్మా" అని సరస్వతికిమాటఇచ్చాను. దానిఫలితం ఈఉత్తరం."

* * *

సుందర్రావు ఆరోజే బయలుదేరి వెళదామనుకున్నాడు కాని డబ్బులేదు. అన్నయ్య పంపుతాడని మూడురోజుల్నించీ ఎదురుచూస్తున్నాడు. ఇవాళో రేపో రావాలి! ఏది ఏమయినా మర్నాడు వెళ్ళటం మాత్రంతప్పదు. పరిస్థితులు ఇంతత్వరలో మేఘాలు కమ్ముకున్నట్లు కమ్ముకుంటాయనుకో లేదు. క్షణిక ఆవేశాలు జీవితం మీద హఠాత్తుగా విపత్తులు తెస్తుంటాయి. రాత్రి పడుకున్నా నిద్రపట్టలేదు. సరస్వతి ఏడుస్తూ అతని కళ్ళ ఎదుట కన్పించసాగింది, తను చేయవలసినవన్నీ మెరుపుల్లా మెరిశాయి. సరస్వతిని పెళ్ళిచేసుకోవడం అన్నయ్యకు ఇష్టం వుండదు తనకి ముందే తెలుసు. తెలిసికూడా సరస్వతిని చేసుకోడానికే నిశ్చయించుకున్నాడు.

"తిరునగర్"

తను ఏ రోజున కాలువగట్టున సరస్వతిని చేసుకోవాలని నిశ్చయానికి వచ్చాడో తనకిప్పుడు గుర్తు లేదు. మొత్తంమీద అన్నయ్యతో పేచీ తప్పదనే విషయం మాత్రం అప్పుడే నిర్ణయించుకున్న మాట నిజం.

కాని తను ఒక్క పొరపాటు చేశాడు. "విద్యార్థుల్లో మనో నిగ్రహం ఉండాలి" అని ఉపన్యసించిన తను ఎందుకలా చేశాడో ఆలోచించుకొంటే కాలంచేతుల్లో తను అసమర్థుడనే అర్థమైపోయింది. సరస్వతిలో తప్పేమీలేదు. ఆమె స్త్రీ, తను మొగవాడు. ఆ సమయంలో ఆమె అంతకంటె ఏం చెయ్యగలదు? అతనూ అలా చెయ్యాలనుకోలేదు. విధి బలవత్తరమైంది.

తనంటే సరస్వతికి ఎంత నమ్మకం?

తెల్లవారింతరువాత ఒక్కక్షణం కూడా ఉండ బుద్ధివెయ్యలేదు. రూమ్‌మేటు రాజారావు దగ్గర పదిరూపాయలు అడిగితీసుకొని ప్రయాణమయ్యాడు. అంత హఠాత్తుగా ప్రయాణమయ్యేసరికి రాజారావు ఆశ్చర్యపడ్డాడు.

"రేపు స్పీచ్ కాంపిటిషన్..." అనబోయాడు.

"పోనీరా! వెధవకాంపిటీషన్. ఇది నా జీవిత సమస్య! ఏమైనాసరే. వెళ్ళాల్సిందే!" అన్నాడు.

సుందర్రావుని చూచి అన్నయ్య రమణారావూ ఆశ్చర్యపడ్డాడు. ఈమధ్యలో తను రావటానికి వీల్లేదని - రానని ఉత్తరంరాసి ఇంత హఠాత్తుగా ఎందుకొచ్చాడో అతని కర్థంకాలేదు.

"ఏం వొచ్చావు?" అని అడిగాడు ఆదుర్దాగా!

"ఆఁ...మరి..." సుందర్రావు సమాధానం కోసం నసిగాడు. "డబ్బు పంపిద్దామనే అనుకుంటున్నా! ఏడీ. ఆ రామబ్రహ్మంగారు ఇవ్వాళ రేపు అంటున్నారు. రేపో, ఎల్లుండో పంపేవాణ్ణి! మళ్ళా చార్జీలు అనవసరంగా దండగవాలా? ఈ రెండు రోజులూ ఎట్లాగో జరిపితే సరిపోయేదిగా" అన్నాడు రమణారావు. తమ్ముడు డబ్బుకోసమే వచ్చాడని ఆయన విశ్వసించాడు.

అన్నయ్య వెళ్ళిపోయింతరువాత వదిన సంగతులన్నీ చెప్పింది.

"వాళ్ళనాన్నకి నిన్ననే సరస్వతి విషయం తెలిసిందట. అగ్గిరాముడై మండిపడుతున్నాడు" అంది వదిన.

"వదినా! ఈ విషయంలో అన్నయ్యతో చెప్పాలి ఎలాగైనా" అన్నాడు. తనకి ఆయన దగ్గర మాట్లాడ్డం అలవాటులేదు. అదీగాక ఈవిషయాన్ని ఆయన ఎదుట మాట్లాడుతున్నప్పుడు ఏ ముఖభంగిమల్లో నిలబడాలో తనకనూహ్యం!

పొద్దుకూకినా ఇంటికి వెళ్ళాలనిలేదు. వదిన ఈ విషయం అన్నయ్యకు చెప్పినప్పుడు ఆయన ఎట్లా అవుతాడో? కాలవవంపుల్లో తను కూర్చొబడ్డాడు. తనిక్కడే సరస్వతి విషయంలో తర్జనభర్జనలుపడి ఓ నిర్ణయానికి వచ్చాడు. తనింతవరకూ ఊహించలేదుగాని ఇప్పుడది విషమసమస్యగానే అయింది. ఏ విషయాలూ మనం అనుకున్నట్లుగా జరగవు. దానికి భిన్నంగా మారి మన ఎదుట సాక్షాత్కరించేసరికి మనం బెదిరిపోయి ఖంగారు పడతాం! తను పీకలమీదికి వస్తేగాని సమస్యల్ని పరిష్కరించుకునే మార్గం చూచుకోకపోవడం కొందరి ప్రవృత్తి! తనకిది అగ్నిపరీక్షే నిజానికి! తనహృదయంలో సరస్వతికి చోటిచ్చాడు. ఆమె తన సర్వస్వాన్ని అతని కర్పించింది. హృదయాన్ని తనకు అంకితమిచ్చింది.

తను సహజంగా ఆదర్శాలు గలవాడు. ఆదర్శాలు మానవోన్నతికి కారణమనే సిద్ధాంతం అతనిది. తమ్ముడు ఉత్తమోన్నత ఆదర్శాలు కలవాడన్న విషయానికి అన్నయ్య గర్విస్తాడు.

సుందర్రావు కొన్ని-కొన్ని దృఢ నిశ్చయాలకొచ్చేశాడు. తన ఆదర్శాన్ని తన జీవిత సిద్ధాంతాన్ని తను ఏర్పరచుకో గలిగినందుకు, అటువంటివాళ్ళ స్వల్ప సంఖ్యలో తనూ ఒకడయినందుకూ గర్విస్తాడుగూడా! ప్రస్తుత సాంఘిక వ్యవస్థ సిద్ధాంతాలు తనకు నచ్చవు. దాని కట్టుబాటు తనకు వికృతముగా కన్పిస్తాయి. వాటి అవశ్యకత వున్నట్లుగూడా తనకనిపించదు. అతని నరనరాలకూ కొన్ని విశిష్టమైన భావాలు పరిణత పొంది అంటుకు పోయాయి. ఎలాగయినా తన జీవిత ఇతివృత్తాన్ని అత్యంత పునీతమైందిగా సాంఘికచరిత్రలో రాసుకోవాలి. తను చదువుకున్నందుకు సంఘాన్ని సంస్కరించి

దానికి ఓ క్రొత్తమార్గాన్ని చూపి మార్గదర్శకుడవాలి.

సరస్వతిని పెళ్ళిచేసుకోడానికి సంఘం ఒప్పుకోదు. దాని కదిచెప్పే కారణాలు తన కవసరం లేదు. తను సౌందర్యాన్ని ఆరాధిస్తాడు. ఉన్న సౌందర్యాన్ని చూచి, ఆనందించడం ఉప్పొంగడము తన సహజస్వభావం. ఈ విషయంలో తనకి సంఘంతో ప్రమేయంలేదు. లెక్క చెయ్యడు కూడా? తన మనస్సుమీదకూడా సంఘానికేమి అధికారముంది? సరస్వతికీ, తనకీ ఇష్టమైంది. మధ్య అడ్డెందకు రావాలి ఎవరైనాను?

సుందర్రావు ఓ నిర్ణయానికి వచ్చాడు. తను పిరికిపంద కాకూడదు. ధైర్యంతో కష్టాల్ని ఎదుర్కోడానికి సిద్ధంగా వుండాలి. దానివల్ల లోకానికి క్రొత్త వెలుగు చూపించాలి.

వంతెనమీద కూర్చున్నాడు. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులుపట్టాయి. వంతెనమీద నుండి మనుషులు వెళుతూనే వున్నారు. చీకట్లో తన ముఖం ఎవరికీ కనిపించదు. ఇంటికి వెళదామంటే అన్నయ్య గొడవచెయ్యకుండా వదిలిపెట్టడు. తెల్లవారితే కొంతవరకూ అన్నయ్య మనస్తత్వం మారవచ్చు. ఏకంగా అందరూ నిద్రపోయిన తరువాతనే ఇంటికి వెళ్ళాలి.

"సుందరం...నువ్వేనా? ఇక్కడ కూర్చున్నావే?" అన్నయ్యవచ్చాడు దగ్గరికి. గుర్తుపట్టాడుకూడా! ఉలిక్కిపడ్డాడు తను.

"అబ్బే! ఊరికేనే"

"ఇదీ ఓ అబద్ధమే నేమో" అన్నాడు.

అంటే ఇదివరకు తను చెప్పింది అబద్ధమనేగా? తండ్రి చచ్చిపోయిన దగ్గర్నించీ తను అన్నయ్యచేతుల్లో పెరిగాడు. భక్తి గౌరవాలు ఆయనయెడల తనకు లేకపోలేదు. అందుకే తను మాట్లాళ్ళేకపోయాడు.

"ఇంటి కెళదాం పద" అన్నాడు. మెల్లిగా నడిచాడు తను అన్నయ్యవెంట.

"నువ్వు వచ్చిన పనేమిటో మీవదిన చెప్పింది. ఆ సంగతి నిజమేనా?" అన్నాడు.

తను తల వంచుకున్నాడు. రెండు నిమిషాలు ఇద్దరూ నిశ్శబ్దంగానే గడిపారు నడుస్తూ.

"సరస్వతిని చేసుకోవాలనుకోవడంలో నీ వుద్దేశ్యము నీకు పెళ్ళికాదనే భయమా?" అన్నాడు అన్నయ్య.

"అలా ఎలా అనుకుంటూ నన్నయ్యా!"

"మరి?"

"దానికి నేనేం చెప్పను? ఆ విషయంగురించి ఇప్పుడు ఆలోచించ ప్రయత్నించినా ప్రయోజనంలేదు. వదిన చెప్పేవుంటుం దనుకుంటాను. సరస్వతి కిప్పుడు" చెప్పటానికి బిడియపడ్డాడు. "ఎందుకలా చేశావు?" అని అన్నయ్య అడుగుతాడేమోనన్న భయంకూడా లేకపోలేదు లోపల.

"ఆఁ ఆఁ. చెప్పింది. కాని దానికి నువ్వే బాధ్యుడివని నేను నమ్మలేదు. అసలు ఈ విషయం నీకు తెలుసా-సరస్వతికి ఎందుకు సంబంధాలు రావటంలేదో?" అన్నాడు అన్నయ్య.

"ఇంకోసంబంధం ఇష్టంలేక నేమో!" అన్నాడు అతను.

"కాదు. నీకింకా తెలీదు. కుర్రాడివి. అందుకే జీవితంలో ఇలాంటి నిర్నయాలు తొందరపడి నీకు నువ్వే చేసుకోకూడదు. జీవితాంతం విచారిస్తావు. పోనీ వేసి చూద్దాం ఓ రూపాయి అనుకోనే లాటరీగాదు. జీవిత పరిధులు చాలా తక్కువ. సరస్వతి మన కులంపిల్లకాదనే విషయం తీసెయ్యి. ఆమె తల్లి గుణం మంచిదికాదని అంటారు అందరూ!" అన్నాడు. తనకి ఈ సంగతి క్రొత్తేమీ కాదు. "సరస్వతికీ వాళ్ళమ్మకూ వ్యక్తిత్వంలో ఏం సంబంధ ముందన్నయ్యా, తల్లి చేసిన నేరానికి పాపం కూతురు బాధ్యురాలంటావా? ఆమె వేరు, ఆమె తల్లి వేరు" అన్నాడు సుందర్రావు.

అన్నయ్య అందుకున్నాడు "అందుకే నీకు జీవితానుభవం లేదని చెప్పింది. మనల్ని తాసిల్దారు రంగనాథరావుగారి కొడుకులని అనరూ? ఆన వద్దన్నా, అనుకోవద్దన్నా ఎవరు వింటారు. దానికి కారణం నువ్వు నిర్వచించలేవు. అది ఓ ఆచారం!"

"ఒకరి విషయం నా కనవసరం! ఎవరి ఇష్టం వచ్చిన జీవిత విధానాన్ని వాళ్లు నిర్ణయించుకోడానికి కూడా ఈ అడ్డంకు లెందుకో నాకు బోధపడకుండా వుంది" అన్నాడు.

"దీంట్లో బోధపడడాని కేముంది! మనం గీసుకున్న గీతలు. ఆ గీత మధ్యనేవుంటే కాస్త

ఇరుగ్గా వున్నా జీవితం ఒడుదుడుకుల్లేకుండా సుఖంగా సాగిపోతుంది. ఆ గీతను లెక్క చెయ్యకుండా ఇది ఇరుగ్గా వుంది. విశాలమైనదానికి పోతానంటే వచ్చే లాభాలకన్నా నష్టాలెక్కువున్నాయి! ఇది తప్పనిసరి అనుకున్నవాళ్ళకు ఏ బాధా కన్పించదు. నాలోనే వుండండి ఎందుకైనా మంచిది అంటుంది పరిధి. పోతాను అంటే పొమ్మంటుంది. కాని మనం గీసుకున్న గీతని మనమే అతిక్రమించటం..." "అవి ఇరుకైనప్పుడు వాటిని పెద్దవి చేసుకుందాం" సుందరావు అన్నయ్యని మధ్యలో అందుకున్నాడు.

"మళ్ళా ఒకనాటికైనా ఇప్పుడు నువ్వు గియ్యబోయే గీతలు ఇరుకయ్యేవేగా? ఎన్ని పరిధులు దాటి మానవజాతి ఈ స్థితికొచ్చిందంటావు? యువకరక్తపు పొంగులో సాంఘిక వ్యవస్థ శక్తి నీకు తక్కువగా కన్పించవచ్చు! రక్తం ఏదో తెలియని ఆదర్శాలకోసం, ఆవేశాన్ని పొంది పరవళ్లు త్రొక్కుతుంది. కాని అవన్నీ వాస్తవిక ప్రపంచంలోకి తీసుకురావాలంటే కళ్ళవెంట నీళ్లు తిరుగుతాయి" అన్నాడు రమణారావన్నయ్య!

మబ్బులు విడిపోయాయి. చంద్రుడు రాలేదు. చెట్లు చీకటి ముసుగేసుకుని దెయ్యాల్లా అరుస్తున్నాయి. చుక్కల్లో ఏదీ నిలకడగా వెలగడం లేదు. అన్నీ మినుకుమినుకుమంటూ యెప్పుడో ఆరిపోయేట్లుగా వున్నాయి.

"ఇవన్నీ ఆలోచించే సమయం దాటిపోయిందన్నయ్యా! సరస్వతిని ఇప్పుడు చేసుకోనన్నా ఎలా కుగుతుంది?" అన్నాడు.

"ఏం?" ప్రశ్నించాడు అన్నయ్య!

"నే చేసింది తప్పే కావచ్చు. ఆ తప్పుకోసమైనా ఆమెను స్వీకరించాలిగా!" అన్నాడు. రెండు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. రమణారావన్నయ్య ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు. "నువ్వు చెప్పినట్లే అనుకుందాం! నే చేసిన పనికి నన్ను నిందించాలి! ఆ విధంగానైనా సరస్వతిని నేను చేసుకోవాల్సిందే! అలా కానినాడు వలపక్షపు సంఘంతో నాకు పని లేదు" అని సుందరం జంకుకు అన్నాడు.

"నువ్వు నా మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. ఆమె తల్లి వంటిది కూతురు. ఆటు వంటిది కావడం ఆ వంశానుక్రమమైన ఆచారం! ఇది సంఘ దృష్టి" అన్నాడు అన్నయ్య మళ్ళా.

"నువ్వు చెప్పేది అసందర్భంగా ఉన్నది అన్నయ్యా" అన్నాడు ధైర్యం చేసి యెలాగో.

అన్నయ్య "నీమీద నాకు ప్రేమ లేదని నువ్వనుకుంటున్నావా?" అన్నాడు. స్వరంలో ప్రాణం లేదు. ఆరిపోయిన మసిబొగ్గులా వుంది.

"అలా అనుకోగలనా అన్నయ్యా" అన్నాడు సుందర్రావు.

"ఆ విశ్వాసంతోనైనా నా మాట విను. నీమంచి నువ్వు నిర్ణయించుకునే సమయం యింకా రాలేదు. ఇప్పుడు నిన్ను ఒప్పించడం అసాధ్యమైన పని. అనుభవమైన తరువాతగాని ఆలోచించ లేవు. రెండు మార్గాలు. సరస్వతిని చేసుకున్నా నాకేమీ అభ్యంతరం లేదు. కాని నే చెప్పింది మాత్రం మర్చిపోకు. నీ విషయం ఒక్కటే ఆలోచించకు. నీ తరువాత తరతరాలు ఎంత బాధపడతారో ఆలోచించు. రెండోది: నీ చదువు పూర్తిచేసి చక్కగా ఒక ఇంటివాడివి కావటం! అది ఒప్పుకోకపోతే నాన్న ఆస్తి ఏమీ మిగల్చలేదనీ ఇప్పుడున్నదంతా నాదేననీ నీకు తెలుసు. దాంట్లో నీ కేవిధమైన భాగమూ ఇవ్వలేను. దానికి కారణం వ్యక్తిగత విభేదాలు, ద్వేషాలు కాకపోవచ్చు! నీకు నీ జీవితంమీద, భావాలమీద నిర్దుష్టమైన అధికారం లేదు. ఇచ్చిందంతా పాడైపోయిం తరవాత నేను నీ దీనస్థితిని చూస్తూ ఊరుకోలేను" అన్నాడు రమణారావన్నయ్య.

సుందర్రావు ఉద్రేకం తెచ్చుకున్నాడు. "నాకు నా స్వశక్తిమీద నమ్మకం వుంది. నీ నమ్మకాల ప్రకారం నన్ను నడవమనడం, నీవు నమ్మిన కృతక సాంఘిక ఆచారాన్ని నన్ననుసరించమనడంలో అర్థం లేదు. నీ ఆస్తి నాకవసరం లేదు. నీ విషయం తెలి..." మాట పూర్తి కాకుండానే అతని చెంప చెళ్ళున మ్రోగింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. చెంప సవరించుకొంటూ అక్కణ్ణించి గబగబా ఇంటికి వెళ్ళిపోయాడు.

సుందర్రావు సరస్వతిని తీసుకొని పట్నం వెళ్ళిపోయిన రెండో రోజుగ్గాని ఎవ్వరికీ తెలియలేదు. తెలిసినంతరువాతమాత్రం ఊరంతా ఒక్కసారి గుప్పుమంది. ఇంతకుముందు సుందర్రావుకీ-సరస్వతికీ అంతదగ్గర సంబంధం వుందని ఎవ్వరూ ఊహించలేదు. అతనికీ - సరస్వతికీ ఎక్కడా సామ్యంలేదు. అతనితండ్రి రంగనాథరావుగారు తాసిల్దారు చేస్తున్నప్పుడు సరస్వతి తండ్రి తాలూకా గుమస్తాగిరీ చేసేవాడు. పెద్దవాళ్ళు మాత్రం "పాపం రంగనాథరావుగారి కొడుకా? లోకజ్ఞానం తెలీదు" అన్నారు. కాని ఆ 'పాపం' అన్నమాట సరస్వతిపట్ల ఎవ్వరూ ఉచ్చరించలేదు.

సుందర్రావు సరస్వతితోసహా పట్నం చేరుకుని స్నేహితులందర్నీ ఒక్కసారి ఆశ్చర్యసముద్రంలో ముంచేశాడు.

హాస్యప్రసంగంతో మిత్రుల్ని కడుపు చెక్కలయ్యేట్టు నవ్వించే నాథముని "లక్కీ ఫెలో! ఎక్కడ చిక్కిందిరా?" అన్నాడు. సుందర్రావు గుడ్లెర్రజేసేసరికి అది నాథమునినేగాదు అప్పట్నుంచి అందరిస్నేహితులనూ నోరు మూయించింది. రాజారావుకిమాత్రం విషయమంతా వివరించి చెప్పాడు. హాస్టల్లోవుండడానికి వీల్లేదెలాగూను. "ఇల్లెక్కడన్నా చూడ"మన్నాడు.

"అన్నట్లు నీచదువు ఏం చేసినట్లు?" అన్నాడు రాజారావు.

"చదువుకేం?" అన్నాడు సుందర్రావు

"మరి మీ అన్నయ్య ఇష్టపడలేదన్నావు. డబ్బుపంపడన్నమాటేగా?" అని సందేహం వెలిబుచ్చాడు రాజారావు.

"వదిన పంపుతానంది"అన్నాడు సుందర్రావు సందేహనివృత్తిచేస్తూ.

ఇల్లు ఒకటి దొరికిందిగాని అద్దె చాలా ఎక్కువ. "ఎలాగూ అంతఇల్లు తీసుకుంటున్నాంగా. వేరే హాస్టల్లో నీకెందుకుగది. ఇంట్లోనే వుందాం" అన్నాడు సుందర్రావు. రాజారావు ముందు తటపటాయించినా తప్పలేదు చివరికి.

వదినదగ్గర్నించి తెచ్చినడబ్బు ఇంచుమించు అయిపోయింది. రెండోసారి డబ్బురాలేదు. పట్టి ఉత్తరంమాత్రమే వదినదగ్గర్నించి వచ్చింది-తనకు డబ్బిస్తున్న విషయం అన్నయ్యకు తెలిసిందట. ఇక ఒక్కకాణీ అయినా పంపగలిగే అవకాశం లేదని రాసింది వదిన. అయినా తనని ధైర్యం విడువవద్దనిగూడా రాసింది. పాపం.

చదువు తను అనుకోకుండానే ఫుల్‌స్టాపు పడింది. ఇదివరకు కాలేజీకి పోయేవాడుగనక కొంతకాలం వ్యవధివుండేది. ఇప్పుడదీలేకపోయేసరికి ఇరవైనాలుగ్గంటలూ సరస్వతిదగ్గరే కూర్చోవలసి వస్తోంది. అమిత సన్నిహితత్వంవల్ల సరస్వతిలో తనిదివరకు చూచిన పరిపూర్ణతను చూడలేక పోతున్నాడు. ఇంటి అద్దె మొత్తం రాజారావేకడుతున్నాడు. రాజారావుడబ్బుమీద ఇప్పుడు ముగ్గురు బ్రతకవలసి వస్తోంది. పాపం రాజారావుగూడా అందుకు బాధపడలేదు. కాని ఇలా ఎంతకాలం?

ఒకవేపు సరస్వతికి నెలలు నిండుతున్నాయి. ఈ విషయం తలుచుకున్నప్పుడల్లా తనలో భయం కెరటాలు కెరటాలుగా వస్తోంది. తనకి ఒక్కసారిగా విమానంలోంచి సముద్రంమధ్యనపడ్డట్లూ, తనకెవరూ లేనట్లు ఉంటుందొకోసారి. మళ్ళీ మరునిమిషంలో ఆశావాదాన్ని కల్పించుకుని సౌధాలు కడతాడు. తనకు సరస్వతివుంది. కొడుకు పుడతాడు. ఉద్యోగం దొరికితే అన్నీ సుఖంగానే వుంటాయి.

ఏదైనా ఉద్యోగంకోసం ప్రయత్నాలు చెయ్యడం మొదలుపెట్టాడు. ఈ మధ్యకాలంలో కనిపించిన స్నేహితుల దగ్గరల్లా అప్పులు చెయ్యవలసి వచ్చింది. రాజారావు ప్రతి విషయంలోనూ సానుభూతి చూపుతున్నాడు. అతని సుఖాల్ని తనకోసం త్యాగం చేస్తున్నాడు. సినిమాలకి నాటకాలకి వెళ్ళటంమానేశాడురాజారావు, తనకోసం!

ఉద్యోగం తననుకున్నంత తేలిగ్గాదనీ, ఈ రోజుల్లో మరీ అసాధ్యమనీ తెలిసింది. తనకుఏముందని? ఈ సంవత్సరంకూడా చదివితే ఒకదారికి వచ్చేది. రికమండేషన్ అంతకంటే లేదతనికి. ఒక్కరోజు గడచినకొద్దీ జీవిత సమస్య పెద్దదవుతున్నట్లుగా కనిపిస్తోంది. రెండు మూడుసార్లు వదినకి ఉత్తరం రాశాడు. కాని అది ఆమెకు అందినట్లు లేదు. సమాధానంకూడా రాలేదు.

సరస్వతిని తలుచుకుంటేనే పూర్వం తన హృదయమంతా పొంగి పోయేది. కాని ఆభావం ఇప్పుడు రావటంలేదు. సరస్వతితో సహా పట్నం వచ్చిన మొదట్లో ఏ కొద్దికాలం సుఖపడ్డాడో; తరువాతమాత్రం జీవితం ఓ సమస్యగా పూరిపోయి కూర్చుంది. బట్టలు చిరిగి పోయాయి పూర్తిగా రాజారావు బట్టలే తొడుగుతున్నాడు.

ఆవాళ వాళ్ళ వూరినించి ఉత్తరం వచ్చింది. సరస్వతి తండ్రి చచ్చిపోయాడని దాంట్లో సారాంశం: అంత అదుర్దాగా చదివితే! సరస్వతి ఏడ్చిఏడ్చి అప్పుడే కళ్లు మూసింది. పరీక్షలు దగ్గరపడ్డాయి. రాజారావు దీక్షగా చదువుతున్నాడు రాత్రింబగళ్లు. అతనికి నిద్రపట్టలేదు.

జీవితమంతా మహాసముద్రంలా మారిపోయింది. ఎటు చూద్దామన్నా తీరం కనిపించటంలేదు. అన్నయ్యకి తనమీద ఎందుకంత కోపమో తన కర్థం కావటంలేదు. తను ఊహించినట్లు జరగలేదసలు. సరస్వతికి నిండునెలలు, ఎవరూ తోడు గూడాలేరు. తను ఎంత ధైర్యం చెప్పుతున్నా అది చెదిరిపోతోంది. సంఘం పోకడ విచిత్రంగా వుంటుంది. నిజానికది తననేమీ బాధ పెట్టడం లేదు. కానీ "కొట్లావద్దూ - తిట్లావద్దు - కడుపు మాడిస్తే సరి" అన్నట్లుగా చేస్తుంది. ఎవరూ తనని ఏమీ అనరు. అంతమాత్రంచేత ఎవరూ తన విషయం పట్టించుకొని సహాయపడరు.

(ముగింపు వచ్చేసంచికలో)

# నమ్మకాలు

మధిర భానుమూర్తి

నమ్మకాలనేవి అన్నియుగాలలోనూ అందరు మానవులకూ ఉన్నవే. పూర్వపు యుగాల వారివి మూఢనమ్మకాలనీ తమకలాంటి నమ్మకాలు లేవనీ అనుకునేవారు తమని తాము సరిగా అర్థం చేసుకోలేనివారు అవుతారు. ఈ నమ్మకాలు వ్యక్తులను బట్టి కాలాన్ని బట్టి మారుతవి.

ఈ నమ్మకాలు ఎక్కువగా ఉండటానికి కారణం వ్యక్తుల మనోదౌర్బల్యం. ఒక ఆచారం ఎందుకు ఏర్పడిందో, దానివల్ల కలిగే ఫలితాలేమిటో సరిగా తెలుకోకుండా ఆ ఆచారాలను అనుకరించడం మానవస్వభావం. ఇట్టి అర్థంలేని అనుకరణ వల్లనే ఈ ఆచారాలు మూఢనమ్మకాలై విలువలేనివిగా తయారయినై.

భోజనం చేసేటప్పుడు శుభ్రమైన దుస్తులతో ఉండడం ఆరోగ్యానికి మంచిదని గ్రహించి నిత్యం ఉతికినబట్ట కట్టుకోవడం ఒక అలవాటు. రానురాను రోజులు మారేసరికి వీధులవెంట తిరిగి వచ్చిన బట్టలు కాకుండా ప్రత్యేకంగా ఒక పట్టు బట్ట కట్టుకుని భోజనంచెయ్యడం ప్రారంభమైంది. దీని విపరీత పరిణామంగా ఆ నాడు శుభ్రంగా ఉతికినబట్ట మానేసి, నెలలతరబడి నీటిముఖం చూడని మురికికంపుకొట్టే పట్టుబట్టలు కట్టుకోవడంలోకి దిగింది ఈ ఆచారం. ఈ స్థితిలో దీనిని మూఢనమ్మకంగా జమకట్టడం జరిగింది. అసలు ఆచారంలోలేదు ఆ లోటు. దానిని అమలు పరచడంలో ఉంది.

దేవాలయాలకు వెళ్ళేవారిలోకూడా ఇవి కొన్ని ఉన్నాయి. మానవప్రయత్నమేమీ లేకుండా భారమంతా దైవంమీదే పారేసి "నీవే దిక్కు నాయనా! నన్ను రక్షించాలి. అశక్తుడిని." అని అంగలార్చేవారు చాలామంది ఉంటారు. విద్యార్థులు సంవత్సరమంతా ఊరూవాడా చక్కబెట్టి తుదిఘడియల్లో భగవత్ప్రార్థనలో మునిగి పోవటం కద్దు. పరీక్షలు ప్రారంభమయే రోజున ఎంత చిన్న దేవుడేనా కనీసం ఒకవంద కొబ్బరి కాయలు రుచిచూడనివాడుండడు. ఈ భగవంతుడు మామూలు రోజుల్లో కనిపించడు వీరికి. ఎంత చదవకపోయినా ఆ రోజున భగవంతుడి ముడుపు చెల్లిస్తే తాము తప్పక కృతకృత్యులు కావచ్చునని వీరందరి నమ్మకం. మానవప్రయత్నం ఏమీలేనిది భగవంతుడుమాత్రం ఏంచెయ్యగలడు? పాపం!